పింఛన్.. ఆనందం పెంచెన్..



మహిళకు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

- పింఛన్ పెంపుతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం
- కొత్త పింఛన్లతో ఆపన్నులకు భరోసా
- అంతటా పండగ వాతావరణం

పెదగంట్యాడ: పింఛన్ పెంపుతో అవ్వాతాతల కళ్లల్లో ఆనందం వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. కొత్త పింఛన్ల మంజూరు లబ్ధిదారులకు భరోసా లభించినట్లయిందన్నారు. జీవీఎంసీ 65వ వార్డులోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా పింఛన్ సొమ్మును 3000 రూపాయలకు పెంచి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించిన ఘనత సీఎం జగన్‌కే చెందుతుందన్నారు.

489 కొత్త పింఛన్లు మంజూరు

నియోజకవర్గ పరిధిలో మొత్తం 26,904 పింఛన్లు ఉండగా.. కొత్తగా 489 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. వీటి కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.8 కోట్ల 7 లక్షల 12 వేలు ఖర్చు చేస్తుందన్నారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా, కేవలం అర్హత ఉంటే చాలు ప్రతీ పథకాన్ని నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాల కోసం నాయకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండా వలంటీర్లే ప్రతీ ఇంటికి వెళ్లి, వివరాలు సేకరించి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రతీ నెలా ఒకటో తేదీనే వేకువజామున తలుపు కొట్టి మరీ పింఛన్లు అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో పేదల కష్టాలు తెలుసుకున్నారని.. అందుకే ముఖ్యమంత్రి అయిన తర్వాత వారి కన్నీళ్లు తుడుస్తున్నారని అన్నారు. అందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఇక్కడ పాలన సాగిస్తున్నారని కితాబిచ్చారు. ఇంకెవరూ భయపడాల్సిన అవసరం లేదని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోవడం ఖాయమన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు), జీవీఎంసీ జోన్‌-6 జోనల్ కమిషనర్ సింహాచలం, ఏపీడీ రాము, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, భూపతిరాజు సుజాత, మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు, మండల అధ్యక్షులు రాజాన వెంకటరావు, బొడ్డ గోవింద్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు, నాయకులు పల్లా చినతల్లి, దొడ్డి రమణ, సిరట్ల శ్రీనివాస్, రామచంద్రరాజు, సచివాలయం సీవోలు, ఆర్పీలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



66వ వార్డులో పింఛన్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఇమ్రాన్



కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

66వ వార్డులో..

గాజువాక : కొత్తగా మంజూరైన పింఛన్లు, రూ.3వేలకు పెరిగిన వైఎస్సార్ పెన్షన్ కానుకను 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ శుక్రవారం పంపిణీ చేశారు. వార్డులోని వివిధ సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు ఆయన పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు షఫీ తదితరులు పాల్గొన్నారు.

గతంలో పడిగాపులు కాసేవాళ్లం

నేడు కడుపున పుట్టిన బిడ్డలే తల్లిదండ్రులు భారం అనుకుంటున్నారు. అలాంటి సమయంలో మాకు పింఛన్ పెంచి అండగా నిలిచాడు జగన్ బాబు. గతంలో పింఛన్ కోసం కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవాళ్లం. ఎప్పుడు వస్తారో తెలిసేది కాదు. ఇప్పుడు వలంటీర్ ఇంటికే తెచ్చి పింఛన్ ఇస్తున్నారు. ఈ నెల పింఛన్ పెరిగిందని చెప్పి, రూ.3 వేలు ఇచ్చారు. ఆయన రుణం తీర్చుకోలేం. మా మనవడు జగన్‌కు మా ఆశీర్వాదం ఎప్పుడూ ఉంటుంది.

– నెల్లి నాగాయమ్మ, దువ్వాడ సెక్టార్‌–1



నెల్లి నాగాయమ్మకు పెన్షన్ అందిస్తున్న వలంటీర్ నానాజీ

జగన్‌బాబు మా దేవుడు



నేను ఒంటరిగా ఉంటున్నాను. ఏ ఆసరా లేదు. గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. నా పరిస్థితి తెలిసి, వలంటీరే ఇంటికి వచ్చి పెన్షన్ రాశారు. ఇప్పుడు చేతికి డబ్బులు ఇచ్చారు. నిజంగా జగన్‌బాబు మా దేవుడు.

– పట్టా సత్యవతి, గంగవరం, 64వ వార్డు

భర్తను కోల్పోయిన నాకు ఎంతో ఆసరా



నా భర్త ఇటీవలే మరణించడంతో ఆసరా కోల్పోయినట్లయింది. ఆ సమయంలో వలంటీర్ ఇంటికి వచ్చి, నాకు పింఛన్ రాశారు. రూ.3 వేలు ఇచ్చారు. ఇకపై ఇబ్బందులు ఉండవు. పింఛన్ సొమ్ముతో దర్జాగా బతుకుతాను. నాకు భరోసా వచ్చింది. ఎప్పటికీ జగన్‌బాబే మా ముఖ్యమంత్రి.

– వాడపల్లి రామలక్ష్మి, శ్రీనగర్, గాజువాక

ఎవరి దగ్గరా చేయి చాచే అవసరం లేదు



వృద్ధాప్యంలో ఉన్న నాకు ముఖ్యమంత్రి జగన్ పెద్ద కొడుకయ్యాడు. భర్త చనిపోవడంతో దిక్కులేని స్థితిలో ఉన్న నాకు వితంతు పింఛన్ ఇచ్చారు. ఇక ప్రతి నెలా పింఛన్ వస్తుంది. ఎవరి దగ్గర చేయి చాచకుండా దర్జాగా బతుకుతాను.

– పాముల లక్ష్మి, నడుపూరు

భారమైన బతుక్కి భరోసా



ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో నా కాలు విరిగిపోయింది. ఇప్పటి వరకు ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడిని. ఇప్పుడు ఏ పనీ చేయలేని పరిస్థితిలో ఉన్నాను. బతుకు భారంగా గడుస్తోంది. ఈ నెల నుంచి నాకు పెన్షన్ వస్తుంది. ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాను.

– రాయల దాను, మెహర్‌నగర్, గాజువాక

క్లుప్తంగా

డీఆర్‌ఎంకు వినతి



డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఈశ్వర్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి నిర్మాణ పనులు సత్వరం పూర్తి చేయాలని దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వర్ డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌ను కోరారు. నగరంలోని కార్యాలయంలో డీఆర్‌ఎంను కలిసిన ఆయన ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అమృత్ భారత్ రైల్వేస్టేషన్ కార్యక్రమంలో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు చేపట్టేందుకు గత ఆగస్టులో శంకుస్థాపన చేశారని, ఇప్పటికీ పనులు ప్రారంభించ లేదని డీఆర్‌ఎం దృష్టికి తీసుకువెళ్లారు. త్వరితగతిన పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు అడవివరం కోఆపరేటివ్ సొసైటీ మహాజనసభ

సింహాచలం: అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజనసభ ఆదివారం నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. ప్రియాగార్డెన్స్‌లోని స్వామి బృందావనం కల్యాణ మండపంలో ఉదయం 9.45 గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిపారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి సంఘ సభ్యుల షేర్‌ధనంపై చెల్లించే వడ్డీ, త్రిప్ట్ డిపాజిట్లకు వడ్డీ చెల్లించే విషయాలపై ఆమోదం తెలిపే అంశాలతో పాటు సంఘం అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై సభలో చర్చించనున్నట్టు తెలిపారు. సంఘ సభ్యులందరూ హాజరు కావాలని స్వామి కోరారు.

ఆప్సా డైరీ ఆవిష్కరణ

గాజువాక : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల సంఘం(ఆప్సా) ముద్రించిన కొత్త డైరీలను విద్యాశాఖ ఆర్జేడీ ఎం.జ్యోతి కుమారి, డీఈవో ఎల్.చంద్రకళ వేర్వేరుగా ఆవిష్కరించారు. అనంతరం విద్యాశాఖలో ప్రముఖులకు డైరీలను అందజేశారు. కార్యక్రమంలో ఆప్సాతో పాటు గాజువాక ప్రైవేట్ పాఠశాలల సంఘం సభ్యులు జె.సోమశేఖరరావు, పి.భాస్కరరావు, రామకృష్ణ, శ్రీనివాస్, వాసుదేవరావు, రమేష్ నాయుడు, సత్యనారాయణ, గోవింద్, తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోగి కుటుంబానికి సాయం



రోగికి నగదు అందిస్తున్న రామ అప్పారావు

అగనంపూడి: బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధ పడుతున్న వ్యక్తి కుటుంబానికి సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు, ఆయన స్నేహితులు అండగా నిలిచారు. 85వ వార్డు దిబ్బపాలెం కాలనీకి చెందిన కర్రి రమేష్‌కు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో, కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోందని తెలుసుకుని, వారు రూ.15వేల నగదును అందించారు. కార్యక్రమంలో సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, ట్రస్ట్ ప్రతినిధులు కిడిమి హనుమంతరావు, శీరంశెట్టి గోవిందరావు, పొన్నగంటి కొండలరావు పాల్గొన్నారు.

సీఐటీయూ నిరసన

ఉక్కునగరం: రాష్ట్రంలోని అంగన్‌వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్ష అభియాన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల చర్చలు సానుకూలంగా జరిగేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. అధ్యక్షులు వై.టి.దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

సరైన సమాచారంతో అభివృద్ధి

- పరిశ్రమల వార్షిక సర్వేపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీ ప్రసాద్‌బాబు

అక్కిరెడ్డిపాలెం: సరైన సమాచారంతో సరైన అభివృద్ధి నినాదంతో పరిశ్రమలకు సంబంధించిన వార్షిక సర్వే ప్రగతి పథంలో నడుస్తోందని విశాఖపట్నం ఉప జాతీయ నమూనా సర్వే కార్యాలయం ఏడీ బి.ప్రసాద్ బాబు అన్నారు. ఆటోనగర్‌లోని వాసీవా భవనంలో జాతీయ నమూనా సర్వే పరిశ్రమల వార్షిక సర్వేపై పారిశ్రామిక వేత్తలకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో పారిశ్రామిక గణాంకాలను, ప్రగతిని అంచనా వేసేందుకు వార్షిక సర్వే ద్వారా సేకరించిన సమాచారం ఉపయోగపడుతుందన్నారు. మరో ఏడీ పి.రాజశేఖర్ మాట్లాడుతూ పరిశ్రమలపై వార్షిక సర్వే సమాచారాన్ని ఆన్ లైన్‌లో మాత్రమే పొందుపర్చాలన్నారు. ఏఎస్ఐ రిటర్న్ దాఖలు పోర్టల్‌ను డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, కార్యదర్శి రాంప్రసాద్, సంయుక్త కార్యదర్శి అనార్ బాబు, కోశాధికారి పర్చూరి ప్రభాకర్, జాతీయ నమూనా సర్వే సీనియర్ స్టాటిస్టికల్ అధికారులు కేవీఏపీ స్వామి, వి.రత్న కుమార్, పి.రాధా మాధవి తదితరులు పాల్గొన్నారు.

6 కిలోల గంజాయి స్వాధీనం

- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు



గంజాయితో పట్టుబడ్డ నిందితులు పుట్టి శ్రీధర్, గోలి స్వామి చంద్రశేఖర్ రావు

అక్కిరెడ్డిపాలెం: పెదబయలు నుంచి విజయవాడకు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న గాజువాక పోలీసులు వారి నుంచి 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన పుట్టి శ్రీధర్ అనే రౌడీ షీటర్, హైదరాబాదుకు చెందిన గోలి స్వామి చంద్రశేఖర్ రావు పెదబయలులో 6 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. వీరు గంజాయిని విజయవాడకు తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు, పాత గాజువాకలోని ఆర్‌కే డార్మిటరీలో రైడ్ చేసి ఇద్దరినీ అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు సీఐ తెలిపారు.

స్వయం సహాయక సంఘాలకు శిక్షణ తరగతులు

డాబాగార్డెన్స్ : స్వయం సహాయక సంఘ సభ్యులందరికీ సుస్థిర జీవనోపాధి అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేశారని మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్(యూసీడీ) కేవీ పాపునాయుడుతో 4 జిల్లాల పథక సంచాలకులు, మెప్మా సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘ సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారికి అవగాహనతో కూడిన శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. జగనన్న మహిళా మార్ట్, జగనన్న ఈ–మార్ట్, పట్టణ ప్రగతి యూనిట్లు, ఆహా క్యాంటీన్లు, మెప్మా అర్బన్ మార్కెట్లు, చేయూత జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేయడమైందన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ టిడ్కో గృహాల లబ్ధిదారులకు శత శాతం రుణాలు అందించేందుకు బ్యాంకులకు అనుసంధానం చేసి, అనుకున్న టార్గెట్‌ను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అనకాపల్లి నుంచి సరోజిని, శ్రీకాకుళం నుంచి ఎం. కిరణ్‌కుమార్, విజయనగరం నుంచి బి. సుధాకరరావు, ఎస్ఎంసీలు ఆదినారాయణ, ఎస్. శ్రీనివాసరావు, రంగాచారి, లక్ష్మీనారాయణతో పాటు 4 జిల్లాల నుంచి డీఎంసీలు, సీవోలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కూర్మన్నపాలెం: స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. 87వ వార్డు కళింగవీధి, వడ్లపూడి సచివాలయం–2 పరిధిలో 40 లక్షల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కళింగవీధి పార్కులో 20 లక్షల రూపాయలతో సామాజిక భవనం, వడ్లపూడి రామాలయం వద్ద రూ.9.35 లక్షలతో సీసీ ఫ్లోరింగ్, దుగ్గపువానిపాలెం, దానప్పతల్లి గుడి వద్ద రూ.9.65 లక్షలతో సీసీ ఫ్లోరింగ్ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. గాజువాక వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించే వారికి వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్తారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, కార్పొరేటర్ బొండా జగన్నాథం, మండలాధ్యక్షుడు బొడ్డ గోవింద్, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, దుగ్గపు దానప్పలు, ఆడారి శ్రీను, ఎన్నేటి రమణ, చిత్రాడ రమణ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

సంస్థల ప్రైవేటీకరణతో ఆర్థిక వ్యవస్థ పతనం



దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వరంగ సంస్థలే ఆధారమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పతనమవుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1058వ రోజు, శుక్రవారం సంస్థకు చెందిన డబ్ల్యూ.ఆర్.ఎం–1,2 విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని, నిర్వాసితులను, నిరుద్యోగులను నడిరోడ్డుపై పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఈ కుట్రలను ఉద్యమాల ద్వారా అడ్డుకుంటామన్నారు. కార్మిక వర్గ హక్కులు కాపాడాలన్నా.. నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా.. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రభుత్వరంగంలోనే కొనసాగే విధంగా కార్మికులు పోరాడాలన్నారు. అందులో భాగంగా జనవరి 8వ తేదీ ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'వైద్య కారణాలతో ఉద్యోగుల తగ్గింపు సరికాదు'

ఉక్కునగరం: మెడికల్ ఫిట్‌నెస్ ఆధారంగా ఉద్యోగులను తగ్గించాలని యాజమాన్యం నిర్ణయిస్తే తాము అంగీకరించబోమని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ యాజమాన్యం కొంతమంది ఉద్యోగులను మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షకు పంపాలని అందరి విభాగాధిపతులకు ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుతం ఉన్న క్లిష్ట పరిస్థితుల్లో అనుభవజ్ఞులైన మానవ వనరులు అవసరమని యాజమాన్యం గుర్తించాలన్నారు. వృత్తిపరమైన ఆరోగ్య వ్యాధులను అంచనా వేయడానికి ప్రతీ ఏడాది వృత్తి సంబంధిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఏ ఉద్యోగికైనా వృత్తిపరమైన ఆరోగ్య వ్యాధులు ఉంటే ఆ పని పరిస్థితులను మెరుగుపర్చడం యాజమాన్యం బాధ్యత అన్నారు. ప్రస్తుతం యాజమాన్యం అలాంటి పనులు చేయటం లేదన్నారు. అన్యాయమైన, చట్ట విరుద్ధమైన చర్యను ఆపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు, మసేనురావు, జె.రామకృష్ణ, జె.వి.నరేష్‌కుమార్, టి.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకాన్ని నిలిపివేయాలి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకాన్ని నిలిపి వేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని స్టీల్ హెచ్‌ఎంఎస్ నాయకులు హెచ్‌ఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి హర్భజన్ సింగ్‌ను కోరారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో మూడు రోజుల పాటు జరిగిన హెచ్‌ఎంఎస్ జాతీయ మహాసభలకు స్టీల్ హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి జి. గణపతిరెడ్డి నేతృత్వంలో ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హర్భజన్ సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన ఈ అంశాలపై కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖతో పాటు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో చర్చిస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. హర్భజన్‌ను కలిసిన వారిలో ఎస్.వెంకటరావు, వి.అప్పలరాజు, ఎస్.రాజేష్‌కుమార్, పి.ప్రభుకుమార్, బి.సోమిరెడ్డి ఉన్నారు.



హెచ్‌ఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గంగవరం పోర్టు కార్మికుల ఆందోళన

- వేతన బకాయిల చెల్లింపునకు డిమాండ్

పెదగంట్యాడ : అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులకు 44 రోజుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. గంగవరం పోర్టు లోపల రైల్వే ట్రాక్ గేటుతో పాటు ఔట్ గేటు వద్ద వీరంతా బైఠాయించారు. వెంటనే వేతన బకాయిలు చెల్లించాలంటూ నినాదాలతో హోరెత్తించారు. పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కడంతో యాజమాన్య ప్రతినిధులు న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని, బందోబస్తు నిర్వహించారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. గరికిన నూకరాజు అనే కార్మికుడు వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు తరలించారని, అయితే అతనికి కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించేందుకు యాజమాన్యం నిరాకరించిందన్నారు. కార్మికులంటే యాజమాన్యానికి చిన్నచూపు తగదన్నారు. వెంటనే యాజమాన్యం తన వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



గంగవరం పోర్టు లోపల బైఠాయించిన కార్మికులు

మృతుని కుటుంబానికి పరామర్శ

అక్కిరెడ్డిపాలెం: అవినీతి కేసులో చంద్రబాబు జైలుకు వెళ్లడంతో మనస్తాపంతో మరణించిన పమిడిముక్కల రాధాకృష్ణ కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలోని మృతుని ఇంటికి వెళ్లి రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మృతుని భార్య పార్వతమ్మకు రూ.3లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు కుమారాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

అర్హత గల కాంట్రాక్టర్లు టెండరులో పాల్గొనాలి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీలో పొరుగు సేవల ద్వారా పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు గత నెల 26 నుంచి విధులకు గైర్హాజరవుతున్నందున గృహ, గృహేతరాల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థపదార్థాలు ఎప్పటికప్పుడు తరలించేందుకు అద్దె ప్రాతిపదికన టాటా వెహికల్స్ సమకూర్చేందుకు స్వల్ప వ్యవధితో కూడిన ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్ జారీ చేసినట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు టెండర్ నియమ నిబంధనలకు లోబడి పాల్గొనాలని కమిషనర్ పేర్కొన్నారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామివారికి పంచామృతాభిషేకాలు జరిపారు. తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుప్పావై 20వ పాశురాన్ని వివరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వెంకటాద్రిపై సుదర్శన హోమం నిర్వహించనున్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు